నవతెలంగాణ
1
ఆదిలాబాద్
బుధవారం | ఫిబ్రవరి 21, 2024 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని సిర్గాపూర్ గ్రామ శివారులో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ సుమాంజలి తెలిపిన వివరాల ప్రకారం..సిర్గాపూర్ బస్టాండ్ సమీపంలో ఉదయం సుమారు నాలుగు గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు పక్కన నడుస్తుంటే భారీ వాహనం ఢీకొంది. మృతుడి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుంది. నీలం రంగు చొక్క, నలుపు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహన్ని నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, మృతుడి సంబంధికులు ఎస్ఐ(సెల్ ఫోన్ 8712659517)ని సంప్రదించాలని పేర్కొన్నారు.

28న రేషన్ బియ్యం వేలం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ఐదు ఎంఎల్ఎస్ పాయింట్‌లలో పనికిరాని బియ్యాన్ని ఈ నెల 28న వేలం వేస్తున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి తారామణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదు పాయింట్లలో 3373.50 క్వింటాళ్ల బియ్యం ఉన్నాయని, వినియోగానికి పనికిరానందున ఈ నెల 28న వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి పాట కేజీ 21 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందని, ఆసక్తి అర్హత ఉన్న డిస్టిలరీ వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 21 నుండి దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి పేరిట రూ.2000 డిడి చెల్లించి వేలంలో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కెరీర్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కెరీర్ ప్లానింగ్ లేక నేటి యువత రాణించలేకపోతోందని, కెరీర్‌పై శ్రద్ధ వహించాలని హైదరాబాద్ విష్ణు ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ విష్ణువర్ధన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, పీజీ విద్యార్థులు, నిరుద్యోగులకు పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ, ప్రయివేట్ కొలువుల్లో ఎలా రాణించాలో వివరించారు. యువతకు వారి కేరిర్‌పై ప్లానింగ్, ఏ రంగంలో రాణించాలో అనే ప్రణాళిక గురించి వివరించారు. ఏ రంగంలోనైన రాణించాలంటే ముందు వ్యక్తిత్వం, కుటుంబ నేపథ్యం, విలువలు ఈ మూడు అంశాలను పరిగణలోకి తీసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ కొలువులే కాదు ప్రయివేట్ ఉద్యోగాలకు కూడా డిమాండ్ ఉందన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. అధైర్య పడకుండా లక్ష్యాల సాధనకు ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. గ్రూప్స్ నోటిఫికేషన్ వెలువడుతున్న నేపథ్యంలో ప్రిపరేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ రాణించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కెరిర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింగ్‌రావు, కళాశాల అల్యూమిని అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో క్రీడా, సాంస్కృతిక దినోత్సవం



నవతెలంగాణ-బేల

ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షిక క్రీడా, సాంస్కృతిక దినోత్సవాన్ని ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మాధ్యమిక విద్యాధికారి రవీందర్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, అధ్యాపకుల ఆశయాలకు అనుగుణంగా రాబోయే వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు. కలెక్టర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థుల కోసం అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని మండలానికి మంచి పేరు తీసుకోరావాలని కోరారు. చదువులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్, భగవాండ్లు, ఇచ్చోడ ప్రిన్సిపాల్ గణేష్, తాంసి ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-నార్నూర్

నార్నూర్, గాదిగూడ మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మీ లబ్ధిదారులకు విడివిడిగా పంపిణీ చేశారు. నార్నూర్ మండల కేంద్రంలో 51 చెక్కులు, గాదిగూడ మండల కేంద్రంలో 18 చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలాల ఎంపిపిలు కనక మోతు బాయి, అడ చంద్రకళ రాజు, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావ్, వైస్ ఎంపిపి యోగేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, ఎంపీడీఓ జవహర్‌లాల్, తహసీల్దార్లు రాజ లింగం, విజయానందం, డిటి అమృత్‌లాల్, బిఆర్ఎస్ నాయకులు ఖాసిం, ఫెరోజ్‌ఖాన్, సంజీవ్ నాయక్, ఎంపిటిసి కళావతి ఉత్తం, మాజీ సర్పంచ్ రాథోడ్ విష్ణు, మాజీ ఉప సర్పంచ్ విష్ణు పాల్గొన్నారు.

నేటి మెగా జాబ్ మేళాను యువత ఉపయోగించుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోలీసుల ఆధ్వర్యంలో నేడు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను జిల్లాలోని యువత ఉపయోగించుకోవాలని ఎస్పై మహేందర్ తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించి జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రాంతాల్లో వాల్ పోస్టర్లు అంటించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో పోలీసుల ఆధ్వర్యంలో జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యావత్ ప్రజానీకానికి సేవాలాల్ ఆదర్శం

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్
- ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



మాట్లాడుతున్న కలెక్టర్, వేదికపై ప్రజాప్రతినిధులు, సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హింస, మత్తు, ధూమపానాలకు దూరంగా ఉండాలని హితువు పలికి యావత్ ప్రజానీకానికి సేవాలాల్ ఆదర్శంగా నిలిచారని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన అధికారిక వేడుకలకు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. బంజారా మహిళలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వస్త్ర ధారణతో కార్యక్రమానికి హాజరు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంస్కృతికి అద్దం పట్టే గీతాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బంజారా జాతిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చిన ఒక విప్లవ చైతన్య మూర్తి అని తెలిపారు. దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మికవేత్త, సమాజ శ్రేయస్సు కోసం సంత్ సేవాలాల్ చూపించిన మార్గం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో పయనించి, ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. చిన్నతనం నుండే సేవాగుణం అలవర్చుకొని నలుగురికి సహాయపడే వారని, బంజారాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు.

ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు : ఎమ్మెల్యేలు జాదవ్ అనిల్, వెడ్మ బొజ్జు

సేవాలాల్ ప్రజల మేలుకోసం అనేక ఉద్యమాలు చేశారని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని బోధించేవారని ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు అన్నారు. ఆదర్శవంతమైన ఆయన జీవితాన్ని అందరు ఆచరించాలన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సేవాలాల్ మహారాజ్ ఆశయాలను కొనసాగించాలని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా లంబాడాలు వరకట్నం తీసుకుంటున్నారని, దీన్ని బ్యాన్ చేయాలని అన్నారు. లంబాడాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటు పడాలి : జోగు రామన్న, మాజీ మంత్రి

మహనీయులు చూపిన మార్గంలో నడుస్తూ సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని మాజీ మంత్రి జోగు రామన్న సూచించారు. సేవాలాల్ మహారాజ్ సందేశాలను మరింత ప్రచారం చేయాలని, తద్వారా సమాజం మరింత అభ్యున్నతి సాధిస్తుందని అన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్లుగా అనేక మంది మహనీయుల జయంతులు, వర్ధంతులను అధికారకంగా నిర్వహిస్తూ వారి సేవలను స్మరించుకోవడం జరుగుతుందని తెలిపారు. సంఘటితంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మహనీయులు చూపిన మార్గంలో నడుస్తూ సమాజ హితం కోసం పాటు పడాలన్నారు. అంతకుముందు జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, ఎమ్మెల్యే పాయల శంకర్, డిసిసిబి చైర్మన్ భోజారెడ్డి, సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గొడం నగేష్, ఆర్డీవో స్రవంతి, రాథోడ్ రమేష్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాథోడ్ సురేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





గంగాపూర్ జాతరను ఘనంగా నిర్వహించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో ఫిబ్రవరి 23, 24, 25 తేదీలలో జరగనున్న బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతరను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి దేవాదాయ ధర్మాదాయ, పంచాయితీ రాజ్, మిషన్ భగీరథ, రెవెన్యూ సంబంధిత శాఖల అధికారులతో జాతరలో పారిశుధ్యం, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, సౌకర్యాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతర ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాగునీటిపై మిషన్ భగీరథ, భక్తులకు క్యూలైన్ ఏర్పాట్లపై దేవాదాయ శాఖ, పారిశుధ్య పనులపై గ్రామపంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. జాతరలో తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేసే విధంగా మండల పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు నియంత్రణ చర్యలు చేపట్టాలని, వాహన పార్కింగ్ కొరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి పాపిరెడ్డి, రెబ్బెన తహసీల్దార్ జోత్స్న, ఎంపీడీవో శంకరమ్మ, జెడ్పిటిసి సంతోష్, ఎంపిపి సౌందర్య పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల సక్రమ నిర్వహణకు సహకరించాలి

వచ్చే పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలను నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని సక్రమంగా పాటిస్తూ సహకరించాలని అన్నారు. తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 4లక్షల55వేల437 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో 2 లక్షల 26 వేల 991 మంది పురుషులు, 2 లక్షల 28 వేల 416 మంది స్త్రీలు, 30 మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారని తెలిపారు. జిల్లాలో 6, 7, 8 ఫారాల ద్వారా 24,104 దరఖాస్తులు రాగా 21,332 దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. 720 దరఖాస్తులు తిరస్కరించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా చేపట్టిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ పరిశీలన కార్యక్రమం ఈ నెల 14వ తేదీన మాక్ పోలింగ్ పూర్తయినట్లు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల కొరకు సహాయక పోలింగ్ కేంద్రాలతో పాటు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వర్తించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వ ఉద్యోగం పొందిన నర్సింగ్ ఆఫీసర్స్ సక్రమంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజల మన్ననలు పొందాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఉపేందర్ జాదవ్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వం ఉద్యోగం పొందిన 17 మంది నర్సింగ్ ఆఫీసర్స్‌ను శాలువాలతో సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సక్రమంగా విధులు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండ్ దుర్గం విమల, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ సునిత, డా.కపిల్ రాథోడ్, పలువురు నర్సింగ్ ఆఫీసర్స్, పారా మెడికల్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు, పేషెంట్ కేర్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



కాంగ్రెస్, బీఆర్ఎస్ రజాకార్ల పాలనకు త్వరలో చమరగీతం

- భైంసా సభలో అస్సాం ముఖ్యమంత్రి హేమంత బిశ్వ శర్మ



నవతెలంగాణ-భైంసా

తెలంగాణ ప్రజానీకం నేటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ రజాకార్ల పాలనలో మగ్గుతున్నారని, వీరి పాలనకు శాశ్వతంగా చమరగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అస్సాం ముఖ్యమంత్రి హేమంత బిశ్వశర్మ అన్నారు. మంగళవారం బీజేపీ తెలంగాణలో చేపట్టిన విజయ సంకల్ప యాత్రలో భాగంగా పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీజేపీకి ఆదరణ పెరుగుతోందన్నారు. 2018లో 6.8శాతం ఓట్లను మాత్రమే సాధించగా, 2023లో 14.9 శాతానికి పెరిగిందన్నారు. హిందువుల చిరకాల స్వప్నం రామమందిర నిర్మాణాన్ని మోడీ సఫలీకృతం చేశారన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. విజయ సంకల్ప యాత్ర 5500 వేల కిలో మీటర్లు సాగనుందని తెలిపారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలలో ఆదిలాబాద్ బిజెపి అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అస్సాంలో లీటర్ పెట్రోల్ ధర రూ.98 ఉంటే తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అదనపు పన్నులు వేసి రూ.110కి విక్రయిస్తూ ప్రజల నడ్డి విరుస్తోందని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోతోందని తెలిపారు. అంతకు ముందు బాసర అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి విజయ సంకల్పయాత్రను ప్రారంభించారు. ఈ సభలో మణిపూర్ మంత్రి సుసింద్రి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, ఎంపి సోయం బాపురావు, బిజెపి ఎమ్మెల్యేలు రామారావు పటేల్, మహేశ్వర్‌రెడ్డి, పాయల శంకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి, యాత్ర ప్రముఖ్ తాడేవార్ సాయినాథ్ పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డు సాధించిన నృత్య కళాకారులకు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కూచిపూడి నృత్యంలో గిన్నిస్ రికార్డు సాధించిన బాల కేంద్రం నృత్య గురువు మిట్టు రవి, శిష్యులకు బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమలో ముఖ్య అతిథిగా డాక్టర్ ప్రియంక హాజరై సర్టిఫికెట్లు, మెమొంటులు అందించి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆదిలాబాద్ బాల కేంద్రం విద్యార్థులు గిన్నిస్ రికార్డు సాధించడం గర్వకారణమని బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటి సలహదారుడు సాబిర్ హుస్సేన్ తెలిపారు. చిన్నారులు భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, సలహదారులు సాబిర్ హుస్సేన్, బ్రహ్మ సతీష్, మహేందర్, ఆసిఫ్ ఆలీ, విజయ్ కుమార్, మొయిన్, ఇర్షద్, రాంగోపాల్ చౌహన్ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షున్ని కలిసిన సీఐ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణ సిఐగా బాధ్యతలు స్వీకరించిన సతీష్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌ను జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ సమస్యలతో పాటు ఇతర సమస్యలు వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది.

ఎస్ఐగా సందీప్ బాధ్యతలస్వీకరణ



నవతెలంగాణ-కుభీర్

ఎస్సైగా కె.సందీప్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్సై ఎండి షరీఫ్ భైంసాకు బదిలీపై వెళ్లారు. అక్కడ టౌన్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న సందీప్ బదిలీపై ఇక్కడికొచ్చాడు. పోలీసు సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

టీఏజీఎస్‌క్యాలెండర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) నూతన క్యాలెండర్‌ను మంగళవారం తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు మండలంలోని గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తహసీల్దార్‌కు విన్నవించారు. వేసవిలో తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమములో టీఏజీఎస్ మండల అధ్యక్షులు పెందోర్ కృష్ణ, సాంస్కృతిక ఉపాధ్యక్షులు వెట్టి గణేష్ పాల్గొన్నారు.

ఎంపీడీఓను సన్మానించిన ఎంపీపీ

నవతెలంగాణ-జైనథ్



మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో నూతనంగా బదిలీపై వచ్చిన ఎంపీడీఓ ఏ.రవీంద్రనాథ్‌ను మంగళవారం ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకటరెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయితీ అధికారి దిలీప్, కార్యాలయ పర్యవేక్షకులు ముత్యం రావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం : ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నవతెలంగాణ-నేరడిగొండ

క్రీడలతోనే మానసికోల్లాసమని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని బోరిగాం గ్రామ యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రధాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామంలోని సేవలాల్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడంలో ఇలాంటి టోర్నమెంటులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

డీసీసీ పదవి దళితులకు కేటాయించాలి



నవతెలంగాణ-నార్నూర్

స్వతంత్ర వచ్చినప్పటి నుండి జిల్లాలో కాంగ్రెస్ కమిటీ నుంచి అధ్యక్ష పదవి రాలేదని, ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టి సారించి దళితుడికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి కేటాయించాలని దళిత సంఘం గాదిగూడ మండల నాయకులు మోటేరావ్ అనిల్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో దళిత నాయకులతో సమావేశమై మీడియాతో మాట్లాడారు. మంత్రులు ఆలోచించి తమకు న్యాయం చేసే విధంగా చూడాలని కోరారు. ఈ సమావేశంలో దళిత నాయకులు వాగ్మారే బలరాం, డోరలే మురహరి, జివారే రాంకిషన్, గులవే రాహుల్, జాడే రవీందర్, మోరే కిషన్, వాగ్మారే విలాస్, జాబాడే శ్రీహరి, కొట్నాక్ బారిక్ రావ్, భట్లాడే లక్ష్మణ్ ఉన్నారు.

25, 26 అఖిల భారత విద్యార్థుల సదస్సులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



అఖిల భారత విద్యార్థుల సదస్సులు 25, 26 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు అఖిలభారత విద్యార్థిల ఆర్గనైజేషన్ కమిటీ సభ్యుడు ఆజాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో సదస్సుకు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానాన్ని(ఎన్ఈపీ) 2020ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి శాస్త్ర విద్యా విధానం అమలు చేయాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఉన్న బోధన బోధనేతర ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేయాలని, విద్యాయాలన్నిటిలో లింగ సామాజిక న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ బి రాహుల్, శ్రవణ్, గణేష్, విక్రం, నవీన్ కుమార్, సుజయ్, సత్యనారాయణ, సాయికుమార్, ఇఫ్తేఖర్ ఖాన్, అశోక్ పాల్గొన్నారు.

పిప్రిలో క్రికెట్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని పిప్రి గ్రామంలో విఠల రుక్మాయి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహకులు పటేల్ కొడప్పా విజయ్ కుమార్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచాయం చేసుకొని చాస్ వేసి తొలి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.21,000, రెండవ జట్టుకు రూ.11,000 నగదును అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల జట్లు తమ పేర్లను కొడప్పా శ్రీకాంత్‌సెల్ నం. 7893453031కు సంప్రదించాలని సూచించారు. బహుమతుల ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు మండల నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో పార్టీ బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు జిల్లా కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి మావలలోని ఆయన నివాసానికి ఆహ్వానించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు గాను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను నియమించే క్రమంలో తనకు పూర్తిగా అవకాశం ఇవ్వాలని శ్రీకాంత్ కోరారు. అనంతరం ఎమ్మెల్యేకు పూలమాల, శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఇందులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, మావల ఉపాధ్యక్షుడు గోవర్దన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్ గౌడ్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ రావు, మావల మండల అధ్యక్షుడు శేఖర్, నాయకులు దామోదర్ రెడ్డి, నవీన్ రెడ్డి ఉన్నారు.

అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్



నవతెలంగాణ-ముథోల్

అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే బి.నారాయణరావు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులతో కలిసి సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదేవిధంగా గ్రామంలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. ముథోల్‌లో సుమారు రూ.31లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. సిసి రోడ్ల నిర్మాణం నాణ్యతతో చేపట్టాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారెంటీలు అందే విధంగా చూడాలని కార్యకర్తలకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికలతో పాటు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి సత్తాచాటాలని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు మేలు చేసే విధంగా పనిచేయాలన్నారు. గ్రామాల అభివృద్ధి పాటుపడతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్ ఖాన్, ఎంపీటీసీలు సరళ శ్రీనివాస్‌గౌడ్, దేవోజి భూమేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆనందరావు పటేల్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శంకర్ చంద్రే, మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి, నాయకులు నారాయణ, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, కిషన్ పటేల్, కిషన్ పాతంగే, గోవింద్ పటేల్ పాల్గొన్నారు.

రైల్వేలైన్ పనుల్లో కేంద్రం నిర్లక్ష్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్ పనుల నిమిత్తం గతంలో అనేక మార్లు కేంద్రానికి వినతులు అందించినా ఫలితం లేదని, డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ఇవ్వకుండా కేవలం జీఓను విడుదల చేశారని మాజీ మంత్రి జోగురామన్న మండిపడ్డారు. ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 36వ రోజుకు చేరుకోగా బీఆర్ఎస్ పార్టీ తరపున మద్దతు ప్రకటించి సంఘీభావం తెలిపారు. దీక్షలు చేపడుతున్న నాయకులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రాజెక్ట్ రిపోర్ట్ ఇవ్వకుండా జీఓ విడుదల చేసిన కేంద్రం ఆ తర్వాత పనుల విషయాన్నీ పూర్తిగా విస్మరించిందన్నారు. ఆదిలాబాద్ ప్రజలకు ఉద్యోగ అవకాశాలు పెంచేలా, దూర భారాన్ని తగ్గించే విధంగా ఆదిలాబాద్ టూ ఆర్మూర్ మంజూరుకు ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినప్పటికిని కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అంతే కాకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కారణంగానే పనులు నిలిచిపోయాయని బీజేపీ నాయకుల ఆరోపణలు చేస్తుండడం పట్ల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆదిలాబాద్ ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు సరికావన్నారు. ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్ సాధించేంత వరకు దీక్షలకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి చైర్మెన్ నారాయణ, నాయకులు బండి దత్తాత్రి, విజ్జగిరి నారాయణ, రోకండ్ల రమేష్, మెట్టు ప్రహ్లాద్, బండారి సతీష్, సందా నర్సింగ్, అశోక్ స్వామి, వెంకన్న పాల్గొన్నారు.

సమ్మక్క సారక్కకు ఆన్‌లైన్‌లో బంగారం సమర్పణ

- నూతన సేవలు అందుబాటులోకి
- వెబ్ పోర్టల్ రూపొందించిన దేవాదాయ శాఖ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన ములుగు జిల్లా మేడారం సమ్మక్క – సారక్క జాతర ఈనెల 21 నుంచి 24వ తేది వరకు కొనసాగుతుంది. భారత దేశంలో కుంభమేళా తరువాత అత్యధికులు హాజరయ్యే పండుగ ఇదే. వివిధ రాష్ట్రాల నుంచి పది కోట్ల మందికి పైగా హాజరు అవుతారని అంచనా. ములుగు జిల్లా కేంద్రం నుండి 44 కిలోమీటర్ల దూరంలో తాడ్వాయి మండలంలో ఉన్న మారుమూల అటవీ ప్రాంతమైన మేడారంలో దట్టమైన అడవులు, కొండ కోనల మధ్య ఈ చారిత్రాత్మకమైన జాతర జరుగుతుంది. అయితే సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద భక్తులు నిలువెత్తు బంగారాన్ని మొక్కులుగా సమర్పించడం అనవాయితీగా వస్తుంది. కాగా మేడారం వెళ్లలేని వారి కోసం దేవాదాయ ధర్మశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మొక్కులు చెల్లించి ప్రసాదాలు తీసుకోలేని వారు ఆన్‌లైన్ ద్వారా బంగారాన్ని సమర్పించే అవకాశం కల్పించింది. దీని కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ కూడా తయారు చేసింది. దగ్గరలోని మీ సేవా కేంద్రాలు, టీఎస్ ఫోలియో, పోస్టల్ శాఖల ద్వారా ఈ సేవలను పొందేలా అందుబాటులోకి తీసుకువచ్చారు.

సేవలను ఉపయోగించుకోవాలి

ఈ సందర్భంగా దేవాదాయ దర్మశాయ శాఖ సహాయ కమీషనర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఆనంద్ మాట్లాడుతూ మేడారం జాతరకు రాలేని భక్తుల కోసం శాఖ తరపున ప్రభుత్వం కొత్త సేవలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. నిలువెత్తు బంగారాన్ని సమర్పించడానికి ఆన్‌లైన్‌లో కిలో బెల్లం రూ.60 చొప్పున చెల్లిస్తే వారి మొక్కులు చెల్లిస్తామన్నారు. దీనితో పాటు మీసేవా చార్జీలు రూ.35 ప్రసాదం కావాలనుకున్న వారు పోస్టల్ చార్జీలు రూ.100 కలిపి చెల్లించాల్సి ఉంటుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

నవతెలంగాణ-పెంబి

మందపల్లి గ్రామంలో గల కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో సిమ్సన్ ఫార్మా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పెంచాల సత్యనారాయణరావు ఆర్థిక సహాయంతో మంగళవారం కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. 2023-24లో నోబెల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్మెంట్ సొసైటీ ద్వారా 10 కంప్యూటర్లు, 10 టేబుళ్లు, 20 కుర్చీలు, 10 యుపిఎస్‌లు, 10 హెడ్ ఫోన్స్, 1 టీవీ బహూకరించారు. గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు కరీంనగర్, నారాయణపేట, నిర్మల్ జిల్లాలో 5 పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్స్‌ను ప్రారంభించారు. కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి డైరెక్టర్ సత్యనారాయణరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మొత్తం 25 పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తామని చెప్పడానికి ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో నోబెల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్మెంట్ సొసైటీ సంస్థ అధినేత దంతూరి సురేష్‌కుమార్, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాణి పాల్గొన్నారు.



మహిళలు ఆర్థికంగా ఎదగాలి



నవతెలంగాణ-ముథోల్

స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగటానికి కృషి చేయాలని ఐకేపీ డిఎం సాయిప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ముథోల్, తానూర్, బాసర మండలాలకు చెందిన వీవోఏలకు మంగళవారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లకపతి దీదీపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి ఒక్క సంఘ సభ్యురాలు లకపతి చేయడమే ఐకేపీ లక్ష్యమని పేర్కొన్నారు. సభ్యురాలు ఎంచుకున్న జీవన ఉపాధిపై అవగాహన కల్పించి వారికి బ్యాంక్, గ్రామ సంఘం నుండి రుణాలు ఇప్పించి ఆదాయాన్ని పెంపొందించడానికి కృషి చేయాలని కోరారు. ఇందులో వీఓఏ, సిసిలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముథోల్, తానూర్ ఏపీఎంలు గురుచరణ్, నారాయణరెడ్డి, సిసిలు, వీవోఏలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల ఆదిలాబాద్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎల్. జీవన్ రెడ్డి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆయన పుష్పగుచ్చం అందజేసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయన తనకు జిల్లాతో ఉన్న అనుబంధం గురించి, శాంతి భద్రతలపై చర్చించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీఓ



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ రాజ్‌వీర్, ఏపీఓ వసంతరావు పరిశీలించారు. పని ప్రదేశంలో హాజరు, ఫోటో తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాజేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ లత ఉన్నారు.

పనిలో గుర్తింపు ఉండాలి



నవతెలంగాణ-ఉట్నూర్

అధికారులు ఎక్కడ పని చేసిన వారి పనిలో గుర్తింపు ఉండాలని ఎంపీపీ పంద్ర జైవంత్ రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ తిరుమల, ఎంపీఓ మహేష్‌లను శాలువాలతో సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీటీసీ మోహన్ సింగ్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా బొడ్డు గంగారెడ్డి

నవతెలంగాణ-బోథ్


గంగారెడ్డి


ఆదే వసంత్

బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా మండల కేంద్రానికి చెందిన బొడ్డు గంగారెడ్డిని ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పభుత్వ జీఓ నెంబర్ 308లో చైర్మెన్, వైస్ చైర్మెన్‌లతో పాటు 18 పాలకవర్గ సభ్యులను నియమిచినట్లు పేర్కొంది. చైర్మెన్‌గా గంగారెడ్డి, వైస్ చైర్మెన్‌గా ఆడే వసంత్ రావులను నియమించారు. ఈ సందర్భంగా చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా బోథ్ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | ఫిబ్రవరి 21, 2024 | www.navatelangana.com

పాత్రికేయులపై దాడి దారుణం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ప్రజలు, ప్రభుత్వాలకు మధ్య వారధులుగా పనిచేసే పాత్రికేయలపై దాడులు దారుణమని సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, బావండ్ల పెల్లి నర్సయ్య, కలికోట రమణయ్య, ఎస్ఆర్ మూర్తిలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఓ దిన పత్రిక ఫొటో గ్రాఫర్ కృష్ణపై కొందరు దుండగులు దాడి చేసి తీవ్రంగా గాయపరచడం హేయమైన చర్య అని తెలిపారు. ఇలాంటి దాడులను సమాజం, మేధావులు, ప్రజలు ఖండించి పాత్రికేయులను కాపాడుకోవాలన్నారు.

రేపు ఉచిత కంటి పరీక్షలు

వాంకిడి : మండల కేంద్రంలో ఈ నెల 22న ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్టు జెడ్పీటీసీ అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవన్ ఆప్టికల్ మంచిర్యాల ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వ్యక్తిని హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులకు జీవిత కాలం జైలుతో పాటు రూ. 8వేలు జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్ తీర్పు ఇచ్చారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ కే.సాగర్, ఆసిఫాబాద్ సబ్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ రామ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2021 సంవత్సరంలో సిర్పూర్(యు) మండలం ధనోర గ్రామానికి చెందిన సెడ్మకి తుకారంను అదే గ్రామానికి చెందిన సెడ్మకి నాందేవ్, సెడ్మకి భీంరావులు హత్య చేసిన నేరంపై కేసు నమోదైంది. విచారణలో హత్య నేరం రుజువు కావడంతో నేరస్తులు నాందేవ్, భీంరావులకు సెక్షన్ 302ఐపీసీ ప్రకారం జీవిత కాలం జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున, మొత్తం రూ.8వేలు జరిమానా విధించటం జరిగిందని తెలిపారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ సురేష్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

డిగ్రీ విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో సీఐ సాదిక్‌పాషా విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లాకేంద్రంలో ఎస్పీ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మెగా జాబ్‌మేళాలో పాల్గొని ఉపాధి మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి సమస్యలున్నా డయల్ 100కు ఫోన్ చేసి సమస్య నుండి బయటకురావాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ మధూకర్, కళాశాల ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్



నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాష్ట్రస్థాయి ఫిజికల్ సైన్స్ ఫోరం, బయోలజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లాలోని 8, 9వ తరగతి విద్యార్థులకు పట్టణంలోని పెట్రోల్ పంపు పాఠశాలలో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని కలిగించేలా వారిలోని సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీసేందుకు ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఆసిఫాబాద్ మోడల్ స్కూల్ విద్యార్థి గుండేటి వర్షిత్ మొదటి స్థానం, జెడ్పీఎస్ఎస్ పెట్రోల్ పంప్ కాగజ్‌నగర్ పాఠశాల విద్యార్థిని అనూష ద్వితీయ స్థానం సాధించారు. రాష్ట్రస్థాయిలో ఈ నెల 24న నిర్వహించనున్న టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా అధ్యక్షులు మామిడాల తిరుపతయ్య జిల్లా బాధ్యులు తవుటం శ్యాంసుందర్, అనీష్ అహ్మద్, జాడి ప్రవీణ్, జాడి కేశవ్, రోజా రమణి, భాను ప్రకాష్, సాబీర్ పాల్గొన్నారు.

గెజిటెడ్ హెచ్‌ఎం అసోసియేషన్ సభ్యులకు సన్మానం



నవతెలంగాణ-కౌటాల

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో కౌటాల మండలం నుండి గావుడె హన్మంతు, జెడ్పీహెచ్ఎస్, ముత్తంపేట్ జిల్లా కమిటీలో జనరల్ సెక్రటరీగా ఎన్నిక కాగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు నానాజీ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. కౌటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీరిద్దరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ్‌సింగ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లూబ్రాజ్, నాయికిని శ్రీనివాస్, గణపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

- సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు బండ కృష్ణమూర్తి



నవతెలంగాణ-దహెగాం

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు బండ కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని బీబ్రా గ్రామంలో నిర్వహించిన బండ భవానీ స్మారక క్రికెటోర్నమెంట్ ముగిసింది. గత నెల 28వ తేదీ నుండి టోర్నమెంట్ నిర్వహించగా జిల్లావ్యాప్తంగా 40 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. మంగళవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించగా బీబ్రా, ఎడవెల్లి జట్లు పోటీలో తలపడగా ఎడవెల్లి జట్టు విజేతగా నిలిచింది. బీబ్రా జట్టు రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. మొదటి విన్నర్ టీంకు రూ.25 వేల నగదుతో పాటు షీల్డును బహూకరించి రెండో స్థానంలో నిలిచిన బీబ్రా జట్టుకు రూ.15 వేల నగదుతో పాటు మెమోంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల స్నేహం మెరుగుపడుతుందని, ఓడిన జట్టు మరోసారి గెలుపుకు అవకాశాలు మెరుగుపరుచుకోవచ్చన్నారు. అంతకుముందు గ్రామస్తులకు, క్రీడాకారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బండ ముక్తేశ్వర్, బండ రమేష్, రౌతు విఘ్నేశ్వర్, ముఖషిర్ పాషా, మణికంఠగౌడ్, విశ్వజిత్ బాలతో పాటు గ్రామస్తులు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దారులన్నీ మేడారానికే..!

- డిపో నుండి 80 ప్రత్యేక బస్సులు
- రోజువారీ ప్రయాణికులకు తప్పని తిప్పలు



ఆసిఫాబాద్‌లో మేడారం జాతర కోసం ఏర్పాటు చేసిన బస్సు వద్ద ప్రయాణికులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ కుంభమేళ మేడారం జాతరకు సంబంధించి ఇప్పటికే పెద్ద మొత్తంలో భక్తులు తరలి వెళ్తున్న నేపథ్యంలో ఆర్టీసీ వారం రోజుల పాటు మేడారంకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి మంగళవారం పెద్ద మొత్తంలో మేడారం భక్తులు తరలి వెళ్తున్నారు. జాతరకు వెళ్లే భక్తుల కోసం పెద్ద మొత్తంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడంతో రోజువారి ప్రయాణికులకు వారం రోజులపాటు తిప్పలు తప్పవని చెప్పాలి.

డిపో నుండి ప్రత్యేకంగా 80 బస్సులు

మేడారం జాతరకు వెళ్లే వారి కోసం ఆసిఫాబాద్ డిపో నుండి ప్రత్యేకంగా ఆర్టీసీ అధికారులు 80 బస్సులు ఏర్పాటు చేశారు. వీటిలో 35 బస్సులు డిపో నుండి పంపిస్తుండగా, 35 బస్సులు బోధన్ డిపో నుండి 10 బస్సులు ఉట్నూర్ డిపో నుండి తీసుకువచ్చారు. ఆసిఫాబాద్, బెల్లంపల్లి రెండు పాయింట్లలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. గత జాతరకు డిపో నుండి 65 బస్సులు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం రద్దీ నేపథ్యంలో మరో 15 బస్సులు పెంచి 80 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. బోధన్, ఉట్నూర్ డిపో నుండి తెచ్చిన బస్సులకు సంబంధించిన సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

మేడారం చార్జీల వివరాలు..

మేడారం జాతరకు వెళ్లే వారికోసం ఆసిఫాబాద్ నుండి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులు పెద్దలకు రూ. 550, పిల్లలకు రూ.300, బెల్లంపల్లి నుండి పెద్దలకు రూ.470, పెద్దలకు, పిల్లలకు రూ.260 చార్జీలు నిర్ణయించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం అందించనుండగా, ఒరిజినల్ ఆధార్ కార్డు వెంట ఉంచుకోవాల్సి ఉంటుంది. తిరుగు ప్రయాణంలో మేడారంలో పాయింట్ నెంబర్ 15 వద్ద ఆసిఫాబాద్ బస్సు ఎక్కాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

రోజువారి ప్రయాణికులకు తప్పని తిప్పలు

మహాలక్ష్మి పథకంతో ఇప్పటికే ప్రయాణికుల రద్దీ పెరిగి బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. మేడారం జాతర సందర్భంగా డిపోలోని 80 బస్సుల్లో 35 బస్సులు మేడారానికి వెళ్తుండగా 45 బస్సులు మాత్రమే వారం రోజుల పాటు రోజువారి రూట్లలో తిరుగనున్నాయి. దీనితో రోజువారీగా వివిధ పనుల నిమిత్తం ఆర్టీసీపై ఆధారపడుతున్న ప్రయాణికులకు తిప్పలు తప్పవు. బస్సుల కుదింపు నేపథ్యంలో ప్రయాణాన్ని ముందుగా నిర్ణయించుకోవాల్సిందిగా అధికారులు సూచిస్తున్నారు.

ప్రయాణికుల అవసరాల మేరకు బస్సులు

శ్రీధర్, డిపో మేనేజర్.

డిపోలోని 80 బస్సులలో 35 బస్సులను మేడారానికి వేస్తున్నప్పటికీ రోజువారి ప్రయాణికులకు కూడా ఇబ్బంది కాకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. మేడారం వెళ్లేవారు ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి. మహాలక్ష్మి పథకానికి ఒరిజినల్ ఆధార్ కార్డు వెంట ఉంచుకోవాలి.

రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు ముంజం ఆనంద్ కోరారు. మంగళవారం కమర్షియల్ ఇన్స్‌పెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు ఆనంద్ మాట్లాడుతూ రైళ్లలో కోచ్ క్లీనర్స్ కార్మికులు లేకపోవడంతో చెత్త నిండి టాయిలెట్స్ సక్రమంగా లేక దుర్వాసనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందలకు పడుతున్నారని తెలిపారు. కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం 2, 3లో కూర్చోడానికి సరిపడా బెంచీలు,షెడ్డులు, చల్లటి తాగు నీరు, వసతి, మరుగుదొడ్లు, ఎక్సలేటర్ సదుపాయాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడె భీమేష్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు శంకర్, సంజీవ్, కోరెంగ మాలశ్రీ పాల్గొన్నారు.

స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలి



నవతెలంగాణ-కౌటాల

స్వచ్ఛంద రక్తదానానికి యువకులు ముందుకు రావాలని ఎస్సై మధుకర్ అన్నారు. మండల కేంద్రంలోని మన్నెవార్ల సేవా సంఘం భవనంలో మంగళవారం జీవన్‌దార బ్లెడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని తాళ్లపెల్లి సత్యనారాయణగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడిన వారమవుతామని, రక్తదానంపై ఉన్న అపోహలను వీడాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. ఈ శిబిరంలో 20 మంది మహిళలు రక్తదానం చేయడానికి ముందుకు రావడంతో వారిని అభినందించారు. ఈ శిబిరంలో మొత్తం 102 మంది రక్తదానం చేయగా అందులో సుమారు 20 మంది మహిళలు రక్తదానం చేశారు. ఇది కాగజ్‌నగర్ పట్టణకేంద్రంలోని జీవన్‌దార బ్లెడ్ సంస్థాన్‌లో ఉంటుందని, ఎవరికి అత్యవసరమైన రక్తం కోసం అక్కడికి వెళ్లొచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు దిలీప్, పండరి, వైద్యులు, వైద్యసిబ్బంది ఉన్నారు.

భూమి ప్రజాప్రయోజనాలకు అప్పగించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు గ్రామ సమీపంలోని సర్వేనెంబర్ 61లో ఉన్న భూమిని ప్రజా ప్రయోజనాలకు అప్పగించాలని ఆ గ్రామ ప్రజలు జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సమీపంలోని సర్వేనెంబర్ 61లో 1250 ఎకరాల రెవెన్యూ భూమి ఉందన్నారు. దీనిలో ఇప్పటికే కొంతమంది పేద ప్రజలు సాగులో ఉన్నారని వారికి 30 సంవత్సరాల క్రితం పట్టాలు ఇచ్చారన్నారు. అది పోను మిగతా భూమిని ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించే ఉద్దేశంతో గతంలో మండల కేంద్రంలోని అన్ని రకాల కార్యాలయాల కోసం ప్రతిపాదనలు పంపించారని తెలిపారు. ఇదిలా ఉండగా అటవీశాఖ అధికారులు ఆ భూమి తమకు సంబంధించినదేనంటూ ఎవరైనా ఆక్రమణకు ప్రయత్నిస్తే కేసు నమోదు చేస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాల్సిన భూమిని ఎటువంటి ఆధారాలు లేకపోయినప్పటికీ అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వెంటనే భూమిని గ్రామ ప్రజాప్రయోజనాలకు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెంచికల్‌పేట్ ఎంపీటీసీ దూగుంట రాజం, మాజీ సర్పంచ్ గణపురం కావ్య నాగేశ్వర్, అంబేద్కర్ సంఘం గ్రామ అధ్యక్షులు దుర్గం సంతోష్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు మధుకర్, శ్రీనివాస్, తిరుపతి, సముద్రాల రాజన్న, రామచందర్ పాల్గొన్నారు.

26న విద్యాసంస్థలకు సెలవు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 26న సంత్ సేవాలాల్ 285వ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ప్రయివేటు విద్యాసంస్థలకు స్థానిక సెలవును ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ బోర్కడ హేమంత్ ఒక ప్రకటన పేర్కొన్నారు. దీనికి బదులుగా ఏప్రిల్ నెలలో వచ్చే రెండవ శనివారం విద్యాసంస్థలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- సీఈఓ అనిల్‌కుమార్

నవతెలంగాణ-కౌటాల

మండలంలో వచ్చే వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలో పర్యటించినంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశ మందిరంలో కార్యదర్శులు, ఎంపీడీఓ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేయవద్దని, వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని, ఎండాకాలంలో ఏఏ గ్రామాల్లో నీటి సమస్య ఎదురవుతుందో అలాంటి గ్రామాలను కార్యదర్శులు ముందుగానే పరిశీలించి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్మికులతో పారిశుధ్య పనులను ప్రతిరోజు చేయించాలన్నారు. అదే విధంగా పలు గ్రామాల్లో ట్యాంకులు ఉన్నప్పటికీ మిషన్ భగీరథ ద్వారా నీల్లు అందుతున్నాయో లేదో కార్యదర్శులు చూసుకొని సంబంధిత మిషన్ భగీరథ అధికారులను పిలిపించి నీటి సరఫరా చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు.

పెంచికల్‌పేట్ : వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో నీటి కోసం ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని జిల్లా పరిషత్ సీఈఓ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకాస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పనుల గురించి ఏపీఓ సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నూతనంగా వచ్చిన జిల్లా పరిషత్ సీఈఓ అనిల్‌కుమార్‌కు ఎంపీడీఓ గంగాసింగ్ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లోడ్‌పెల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సీఈఓ అనిల్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఈఓ అనిల్ కుమార్ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు మంచినీరు సక్రమంగా అందించాలని సూచించారు. ఉపాధి హామీ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. బెజ్జూరు మండలం కేంద్రానికి పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా వచ్చిన సందర్భంగా ఎంపీడీఓ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట జిల్లా పరిషత్ సూపరిండెంట్ దుర్గం తోటజీ, ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సోహెల్ అహ్మద్, అసిస్టెంట్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : రాబోయే వేసవికాలంలో ప్రతి గ్రామంలో తాగునీటి కొరత లేకుండా తాగునీటి సౌకర్యం లేని గ్రామాలను గుర్తించిపై సమాచారం అందించాలని, అలాగే పారిశుద్ధ్యం, ఉపాధిహామీ చట్టంలో పని కావాల్సిన వారందరికి ఉపాధి కల్పించాలని జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం మండల, గ్రామస్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి ఉపాధిహామీ చట్టాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను కల్పిస్తూ కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తూ ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించే విధంగా వారికి సహకరించాలన్నారు. అలాగే రాబోయే వేసవికాలంలో మండలంలో ఏ గ్రామంలో నీటి వసతి ఉంది, లేని గ్రామాలను గుర్తించి తాగునీటి సమస్యను తీర్చాలన్నారు. గ్రామాల నుండి తాగునీటిపై ఫిర్యాదులు వస్తే క్షేత్రస్థాయి పర్యటన చేసి తెలుసుకోవాలన్నారు. నీటి కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందన్నారు. అనంతరం సీఈఓను ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందితో పాటు జెడ్పీ సూపరింటెండెంట్ దుర్గం తోటాజీని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎంపీఓ కృష్ణమూర్తి, ఏపీఓ రామ్మోహన్, కార్యలయం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్



కౌటాల



బెజ్జూర్



సిర్పూర్(టి)

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం | ఫిబ్రవరి 21, 2024 | www.navatelangana.com

కాంగ్రెస్‌లో మాజీ సర్పంచుల చేరికలు



నవతెలంగాణ-తాండూర్

అచలాపూర్ గోపాల్ నగర్ మాజీ సర్పంచులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. తాండూర్ మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అచలాపూర్ మాజీ సర్పంచ్ శంకరమ్మ, గోపాల్ నగర్ మాజీ సర్పంచ్ గజ్జల బక్కమ్మ, బీఆర్ఎస్ తాండూర్ గ్రామ యూత్ వైస్ ప్రెసిడెంట్ శివకృష్ణ, తాండూర్ ఆర్ఎంపీ డాక్టర్ సత్యనారాయణ, అనుచరులతో కలిసి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా ఎంపీటీసీ సిరంగి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పురుగులమందు తాగి వృద్ధుని ఆత్మహత్య

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని సూరారం గ్రామానికి చెందిన పాలమాకుల నారాయణ(70) వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ పీ.చంద్రకుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతుడు ఈ నెల 16న రాత్రి మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడి భార్యపై చేయిచేసుకుని ఇంట్లో నుండి వెళ్లి పొలం వద్ద పడుకుని తిరిగి మరుసటి రోజు ప్రొద్దున ఇంటికి వచ్చే సరికి భార్య పడుకొని బాధపడుతూ ఉండటం గమనించి మనస్థాపంతో తిరిగి పొలం వద్దకు వెళ్లి పంటకు కొట్టె పురుగల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన కుమారునికి విషయం తెలిసి మంచిర్యాల మెడిలైఫ్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించగా పరిస్థితి విషమయించడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మంగళవారం మధ్యహ్నాం మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు ఆడ పిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు.

గల్ఫ్ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.500 కోట్లతో గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని మండలంలోని కిష్టాపూర్ గ్రామ గల్ఫ్ సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడిపల్లి సంపత్ అన్నారు. మంగళవారం మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు బొజోజుల సుధాకర్ గుండెపోటుతో ఇటీవలే మతి చెందడంతో వారి కుటుంబానికి గ్రామ గల్ఫ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో తమ వంతు సహాయంగా రూ.55 వేల ఆర్థిక సహాయాన్ని వారి భార్యా పిల్లలకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది గల్ఫ్ కార్మికులు అనారోగ్యాలతో మరణిస్తూ ఉంటే ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వం గల్ఫ్ కార్మికులనీ పట్టించుకోలేదు, ఈ ప్రబుత్వమన్న పట్టించుకోని గల్ఫ్ కార్మికుల కుటుంబాలని ఆదుకోవలని వేడుకుంటున్నామన్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు ఒకటే మార్గమని వారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గల్ఫ్ సంక్షేమ సమితి సభ్యులు అంకం మహేష్, సొన్నాయిల సాగర్, కుధురుపాక రాజన్న,పెట్టం రమేష్, హనుమండ్ల నగేష్, గంగారాపు రాము, సంటి మల్లేష్, మమిడిపెల్లి లక్ష్మణ్, సన్నాయిల మహేష్, ముంజంపేల్లి దినేష్, ఓడిపెల్లి మురళి, కొల్లూరి రాజన్న, ముల్కల నర్సయ్య, రేణుకుంట బాపురావు, తదితరులు పాల్గొన్నారు

కోల్ ఇండియా లాగే వేతనాలు ఇవ్వాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియా వేతనాలే అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఎస్సీసీడబ్ల్యూయూ-ఐఎఫ్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి.బ్రహ్మానందం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణిలో మంగళవారం కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు 10 సంవత్సరాలుగా ఒక్క రూపాయి వేతనం కూడా పెంచలేదని, కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు కనీసం హాస్పిటల్స్ సౌకర్యం కల్పించలేదని అన్నారు. సింగరేణిలో అన్యక్రాంతం అవుతున్న క్వార్టర్లను సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు ఇవ్వాలని అనేకసార్లు ఎస్సీసీడబ్ల్యూయూ-ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో సింగరేణి యాజమాన్యానికి లేఖలు పెట్టినప్పటికీ కాంట్రాక్టు కార్మికులకు క్వార్టర్ సౌకర్యాన్ని కల్పించలేదని, ప్రతి సంవత్సరం సింగరేణి సంస్థకు కోట్ల రూపాయల లాభాలు వస్తున్నప్పటికీ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటాను ఇవ్వడం లేదని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని 2016లో తీర్పు ఇచ్చినప్పటికీ సింగరేణిలో అమలు చెయ్యడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ డివిజన్ నాయకులు శంకర్, సుధాకర్, ఈశ్వర్, త్రిమూర్తులు, శేఖర్, బాపు, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

సందడిగా వాగేశ్వరి కళాశాల వీడ్కోలు వేడుక



నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట పట్టణంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో మంగళవారం వాగేశ్వరి కళాశాల వీడ్కోలు వేడుక సందడిగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ అప్పని లక్ష్మణ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తి భావాలతో మెలుగుతూ ఉన్నతమైన స్థానాలకు చేరుకొని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఇదే వాగేశ్వరి కళాశాలలో చదువుకున్న ఎంతోమంది వ్విద్యార్థులు నేడు ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారన్నారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించడం ద్వారా మంచి అవకాశాలు దక్కుతాయన్నారు. వీడ్కోలు వేడుకలో విద్యార్థులు రూపొందించిన సాంస్కృతిక నృత్యాలు ప్రత్యేక ఆకర్షణంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్, సాగర్, నరేష్, రమణ, వంశీ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి నియోజకవర్గాన్ని అంచలంచలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం మండలంలోని మాదారం రేచిని, కిష్టంపేట, బోయపల్లి గ్రామంల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో 25 మంది కల్యాణలక్ష్మి లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా రహదారుల అభివృద్ధి విద్య, వైద్యం, మంచినీటి సౌకర్యాల ఏర్పాటుకు నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలకు గోదావరి నీటి సరఫరా చేసేందుకు కృషి చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్ఆర్ఈజీఎస్‌తో మంజూరైన మాదారం టౌన్షిప్‌లో రూ.5 లక్షలు తాండూర్ ఎన్‌టీఆర్‌నగర్‌లో కిష్టంపేట రేచీని బోయపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. మాదారంలో సింగరేణి క్వార్టర్లకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని అక్కడి ప్రజలు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని సమర్పించారు. తమకు హెచ్ఆర్ పాలసీ వర్తించేలా కషి చేయాలని తాండూరు మహిళా సమైక్య ఉద్యోగులు కిష్టంపేటలో ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, సూరం రవీందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ మురళీధర్‌రావు, ఎండీ జుబేర్, కే.సుభాష్, సూరం దామోదర్ రెడ్డి, పేరం శ్రీనివాస్, కొడిపాక రంజిత్, కామని శ్రీనివాస్, మసాడి తిరుపతి, మాసాడి కమలాకర్, ప్రభాకర్ పాల్గొన్నారు..

కంక వనం పూజా మహోత్సవం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

సమ్మక్క సారక్క జాతరలో భాగంగా మంగళవారం ఆర్కే-1ఏ పాలవాగు సమీపంలోని కంక వనం పూజా మహోత్సవాన్ని పురస్కరించుకుని మందమర్రి జీఎం ఏ.మనోహర్, ఎస్ఓటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ నేటి నుండి 24 వరకు నిర్వహించే సమ్మక్క సారక్క జాతరకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కార్మికులు అందరూ సకాలంలో విచ్చేసి అమ్మవారి ఆశీస్సులను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ అంజనేయులు, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఆర్కే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ గోవిందరావు, ఆర్కే-1ఎ గని మేనేజర్ జయంత్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలని వినతి

నవతెలంగాణ-నస్పూర్

గోదావరిఖని నుంచి బెల్లంపల్లి వెళ్లే శ్రీరాంపూర్ ఆర్కే-6 కొత్త రోడ్డు మార్గంలో బస్టాప్ వద్ద అక్రమ నిర్మాణాన్ని చేపడుతున్నారని దాన్ని ఆపాలని స్థానికులు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్కే-6 కొత్తరోడ్, జాతీయ రహదారి 363 ఆనుకొని బెల్లంపల్లికి వెళ్లే బస్సులు ఎక్కే చోట నిలబడడానికి కూడా స్థలం లేకుండా ప్రభుత్వ భూమిని ఆక్రమించి కట్టడాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఆ స్థలంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్, స్త్రీలకు మూత్రశాల ఏర్పాటు చేయాలని గతంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖను కోరితే సానుకూలంగా స్పందించిందని పేర్కొన్నారు. కానీ అక్రమ నిర్మాణం చేపట్టిన వ్యక్తి అధికారుల అనుమతితోనే కట్టడాలు చేపడుతున్నట్లు ఆరోపించారు. అధికారులు స్పందించి కట్టడాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని, ప్రజల సౌకర్యార్థం మూత్రశాల, బస్సు షెల్టర్ నిర్మించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బొడ్డు ప్రభాకర్, తలారి సాలమన్ రాజు, ఎస్కే నూరొద్దీన్, సమ్మయ్య పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓకు సన్మానం



నవతెలంగాణ-వేమనపల్లి

ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం బదిలీప వెళ్తున్న ఎంపీడీఓ అల్లూరి లక్ష్మయ్యను ఎంపీపీ ఆత్రం గణపతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని అన్నారు. వారు అధికారులతో ఉన్న సంబంధాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్, ఎంపీఓ శ్రీపతి బాపు రావు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవాన్ని తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తెలుగు కవయిత్రి సుబ్బయమ్మ మాట్లాడుతూ అమ్మ భాష ఎంతో గొప్పదని మన భావాలను మాతృ భాషలో మాత్రమే స్పష్టంగా వ్యక్తం చేస్తామన్నారు. మనకు చిన్నతనం నుంచి మాధుర్యాన్ని పంచిన మాతృ భాషను మరువకూడదన్నారు. అదే విధంగా ఇతర భాషలను కూడా నేర్చుకోవాలని సూచించారు. అంతకు ముందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాతృ భాషను మాట్లాడుతూ భాష పరిరక్షణకు కృషి చేయాలన్నారు. పిల్లలకు దాని గొప్పతనం తెలియజేయాలని కోరారు. ఇంగ్లీష్‌తో పాటు అన్ని భాషలను నేర్చుకోవాలన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలను మరువకూడదన్నారు. అంతకు ముందు తెలుగు విభాగం అధిపతి డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులకు భాష విలువలు తెలియజేయడానికే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు పలు రాష్ట్రాల భాషలలో తమ నాటికలను, నృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ సురేష్, డాక్టర్ హరీష్ పాల్గొన్నారు.



ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-హాజీపూర్

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవని హాజీపూర్ తహసీల్దార్ సతీష్ కుమార్ అన్నారు. మంగళవారం గడిపేట్ శివారులోని సర్వే నంబర్ 197,198,199లోని ప్రభుత్వ భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గుడిపేట్ శివారులోని ప్రభుత్వ భూముల్లో కొందరు ట్రాక్టర్లు పెట్టీ చదును చేయడం లాంటి కార్యక్రమాలు చేయడంపై స్పందించి ఆ భూమిలో ఎవరు చదును చేయకుండా ఫోల్స్ వేశామని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ భూములను ఎవరైనా కబ్జా కు ప్రయత్నం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడడం తమ బాధ్యతగా పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ప్రభుత్వం కేటాయించిన కార్యక్రమాలకు మాత్రమే ఉపయోగం లోకి తెస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్ఐ ప్రభు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మీలో చేరేందుకు ఉచిత కోచింగ్

నవతెలంగాణ-నస్పూర్

దేశభక్తితో సైన్యంలో చేరాలనుకునే యువతకు ఎలాంటి ఫీజు లేకుండా ఉచితంగా కుమార్ గన్నర్స్ స్పోర్ట్స్ అండ్ డిఫెన్స్ అకాడమీ ద్వారా కోచింగ్ ఇస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కే.కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోచింగ్ తీసుకోదలచిన అభ్యర్థులకు ఎలాంటి డాకుమెంట్స్, ఫీజులు ఇవ్వనవసరం లేదన్నారు. ఆర్మీ ఇన్స్ట్రక్టర్ చే నిర్వహిస్తున్న అకాడమీ ఎంతో మంది నిరుపేద విద్యార్థులను సైన్యంలోకి ఎంపికాయ్యేలా చేసిన అకాడమీ స్టడీ మెటీరియల్స్‌తో పాటు క్లాసులు ఇంస్ట్రక్టర్, కోచ్, పీఈటిలతో ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నస్పూర్‌లోని రాయల్ టాకీస్ వద్దగల కోచింగ్ సెంటర్‌ల్లో సంప్రదించాల్సిందిగా తెలిపారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-వేమనపల్లి

ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కోలి స్వర్ణలత అధ్యక్షతన మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమావేశంకు హాజరు కానీ అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు రిపోర్ట్ చేయాలని ఎంపీపీ ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డికి సూచించారు. వ్యవసాయ శాఖ, ఉపాధి హామీ, విద్యా వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతి రాజ్, ఐసీడీఎస్, ఐకెపి తదితర శాఖలకు సంబంధించిన అధికారులు నివేదికలు చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఎంపీపీ కోలి స్వర్ణలత మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు చిత్త శుద్ధితో పని చేయాలని సూచించారు. మండలంలో విద్యుత్ శాఖ పనితీరు బాగా లేదని సభ్యులు అసహనం వ్యక్తం చేసారు. వ్యవసాయ శాఖ అధికారి వీరన్న నివేదిక చదివి వినిపించే క్రమంలో మండలంలో ఎరువుల కొరత లేదని తెలిపారు. దానితో ముల్కలపేట ఎంపీటీసీ దాగమ బాపు స్పందిస్తూ ఎరువుల కొరత లేదనడం సమంజసం కాదని అన్నారు. రాచర్ల డీసీఎంఎస్ సెంటర్‌లో ఎరువులు లేవని చెప్తున్నారని మండిపడ్డారు. డీసీఎంఎస్ యజమాని ప్రయివేటు ఎరువుల దుకాణంలో రూ.350 లకు విక్రయిస్తున్నారని నిలదీశారు. దీనిపైన విచారణ చేపట్టాలని ఎంపీడీఓ ఆదేశించారు. ఈ సమావేశంలో తసీహల్దార్ రమేష్, ఏఈలు శ్రీదర, నరేష్, వైద్యాధికారి రాజేష్, ఏఓ వీరన్న, విద్యుత్ శాఖ ఏఈ దీక్షిత్, ఐసీడీఎస్ సూపర్ వైసర్ సువర్ణ, ఏపీఎం ఉమరాణి ,ఏపీవో సత్యప్రసాద్, ఎంపీటీసీలు దాగామ బాపు, అదే చంద్రకళ పాల్గొన్నారు.

రిటైర్డ్ అధికారులను కొనసాగించడం సిగ్గుచేటు

- ఎస్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

నవతెలంగాణ-జైపూర్

థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్వహణ అనుభవం కలిగి ఉన్న అధికారులు ఉన్నప్పటికీ పదవి విరమణ పొందిన అధికారులను కొనసాగించడం సిగ్గుచేటని ఎస్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను మంగళవారం సందర్శించిన ఆయన 137 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణిలో పదవి విరమణ పొందిన అధికారులకు పదవుల్లో కొనసాగే అవకాశం ఇవ్వడం బాధాకరమని అన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో పవర్ ప్రాజెక్టులు నిర్వహిస్తున్న క్రమంలో పదవుల్లో ఉన్న అధికారులు సమర్థవంతంగా కొనసాగించిన అధికారులు గుర్తించాలని సూచించారు. జైపూర్ ఎస్టీపీపీ ప్రభావిత గ్రామాల వారికి సింగరేణిలో శాశ్వత ఉద్యోగం కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

తహసీల్దార్‌కు విలేకరుల సన్మానం



నవతెలంగాణ-వేమనపల్లి

నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.రమేష్‌ను మంగళవారం మండల విలేకరులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, నాగరాజ్, సత్యనారాయణ, శ్రీనివాస్, ప్రభుదాస్, ప్రబాత్, శ్రీనివాస్, పున్నం పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అధికారులకు సన్మానం

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఎస్ఐ, మున్సిపల్ కమిషనర్‌లను మాల మహానాడు సభ్యులు మంగళవారం సన్మానించారు. నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మందమర్రి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును ఆ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో గజ్జెల్లి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు దాసరి రామన్న మందమర్రి పట్టణ అధ్యక్షులు, పైడిమల్ల నర్సింగ్ రాష్ట్ర అధికార ప్రతినిధి, కోడం శ్రీనివాస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్, నారాయణ పట్టణ ఉపాధ్యక్షుడు బండ రవి పాల్గొన్నారు.



గిరి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

నవతెలంగాణ-జన్నారం

ఆదివాసీ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎస్కె అబ్దుల్లా, కన్వీనర్ అంబటి లక్ష్మణ్ సీనియర్ నాయకులు కే బుచ్చయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపేట రాయికుంట గ్రామంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, శాఖ సమావేశం అణి బాయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగాపాల్గొని మాట్లాడారు. తాగునీరు అందించాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్లను బాగు చేసి తారు రోడ్లు వేయాలన్నరు. అవసరమైన బ్రిడ్జిలను నిర్మించాలని, సమస్యల పరిష్కారానిఇ ఉద్యమించడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | ఫిబ్రవరి 21, 2024 | www.navatelangana.com

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

నవతెలంగాణ-దహెగాం

మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం కళాశాల వార్షికోత్సవంతో పాటు క్రీడా సాంస్కృతికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. అంతకు ముందు ప్రిన్సిపల్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు, దహెగాం ప్రిన్సిపల్ అమరేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో కూడా ముందుండాలన్నారు. ప్రతి ఒక్కరికి కళాశాల జీవితం ఎంతో ముఖ్యమైందని, భవిష్యత్ నిర్మాణం కళాశాలలో విద్యార్థుల ప్రవర్తనపైనే ఆధారపడి ఉంటుందన్నారు. కళాశాలలో చదివే సమయంలోనే మంచి లక్ష్యాన్ని నిర్ణయించుకుంటే భవిష్యత్తు అందంగా ఉంటుందన్నారు. అనంతరం ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు, బదిలీపై వెళ్లిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ప్రిన్సిపల్ రాందాస్, కెరమెరి ప్రిన్సిపల్ పరుశురామ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్టులో విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-జన్నారం



జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని కలమడుగు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన అశ్వక్ రెండు స్థానం సాధించారు. జిల్లాలోని 18 మండలాలకు చెందిన విద్యార్థులకు మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో కలమడుగు పాఠశాలకు చెందిన అశ్వక్ ద్వితీయ స్థానం సాధించి బహుమతిని అందుకున్నారు. అశ్వక్‌ను పాఠశాల హెచ్ఎం రాజమౌళి, ఎంఈఓ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

మేడారం జాతరపై మాక్ జడ్పీ సమావేశం



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మంగళవారం మేడారం సమ్మక్క సారలమ్మ జాతరపై నమూనా జిల్లా పరిషత్ సమావేశం నిర్వహించారు. జాతరలో జరుగుతున్న పర్యావరణ కాలుష్యం, తద్వారా తలెత్తే పరిణామాలు, ప్లాస్టిక్ వాడకం పట్ల ఎదురయ్యే అనర్థాల గురించి, అపరిచితుల పట్ల ఏ విధంగా ఉండాలనే విషయాలపై నిర్వహించే మాక్ జిల్లా పరిషత్ మీటింగ్ ఆసక్తికరంగా సాగింది. విద్యార్థులు, తల్లిదండ్రులలో సామాజిక, పర్యావరణ స్పృహ కలిగించే విధంగా ఈ కార్యక్రమం ఉందని మోడల్ ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య పేర్కొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు ముందస్తు చర్యలు



నవతెలంగాణ-జైపూర్

రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు జాతీయ రహదారి నెంబర్-63పై బార్కేట్లు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై రాములు తెలిపారు. భీమారం ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం వాహనాల రద్దీ నేపథ్యంలో భీమారం మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో మార్కెట్లో ఏర్పాటు చేశారు. ప్రమాదాల నివారించేందుకు ముందస్తు చర్యగా మార్కెట్లో ఏర్పాటుచేసి వాహనాల వేగాన్ని నియంత్రించినట్లు అవుతుందని తెలిపారు.

గిరిజన మహిళకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాసిపేట

ఇటీవల రొట్టెపల్లి గ్రామంలో తన భర్త గిరిజన మహిళను వివస్త్రను చేసి ఎడ్ల బండికి కట్టి కసాయి లాగా ఈడ్చుకు వెళ్ళిన సంఘటనలో బాధిత గిరిజన మహిళకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ అండగా నిలిచారు. ఈ మేరకు తీవ్ర గాయాలతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెసుకున్న ప్రదీప్ ఆస్పత్రికి వెళ్లి రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మైదం రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, షారుక్ ఖాన్, వల్క రాజు, బొగ్గుల నర్సయ్య పాల్గొన్నారు.

మేడారం జాతరపై పర్యావరణ హిత జడ్పీ మోడల్ సమావేశం



నవతెలంగాణ-హాజీపూర్

రాబోయే మేడారం జాతరకు సంబంధించిన వివిధ అంశాలలో తీసుకోవల్సిన చర్యల గురించి సబ్బేపల్లి జడ్పీ హై స్కూల్‌లో మంగళవారం మోడల్ జడ్పీ సమావేశం నిర్వహించినారు. ఈ సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులుగా వివిధ శాఖల అధికారులుగా, అధికార, ప్రతిపక్ష సభ్యులుగా విద్యార్థులు వ్యవహరించారు. ఈ సందర్భంగా జాతరకు సంబంధించి పారిశుధ్యం, నీటి సరఫరా, రవాణా, వైద్యం, పోలీస్ వ్యవస్థ, దేవాదాయ శాఖ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా రాబోయే జాతరను పర్యావరణ హిత ప్లాస్టిక్ రహిత జాతరగా జరుపుకోవాలని తీర్మానించారు. మాంసాహార వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్యం వంటి అంశాలలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించి ఆరోగ్యకరమైన పర్యావరణ హిత పండుగ జరుపుకోవాలని తీర్మానం చేశారు. గైడ్ టీచర్లుగా ఉపాధ్యాయులు బండి రమేష్, పద్మజలు వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయులు సుధారాణి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.

జాతరలో ఇబ్బందులు లేకుండా చూడాలి



● కలెక్టర్ హేమంత్ బొర్కడే

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గంగాపూర్ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కడే అన్నారు. ఈ నెల 23, 24, 25 తేదీలలో శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి జాతరను అధికారులు సమన్వయంతో వేడుకలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. మంగళవారం గంగాపూర్ దేవస్థానంలో ఆవరణలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆలయ కార్యనిర్వహణ అధికారి బాపిరెడ్డి, కమిటీ నిర్వాహకులతో సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతరలో పారిశుధ్య పనుల నిమిత్తం 60 మంది సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. భక్తులకు తాగునీటిని గ్రామీణ నీరుపారుదల శాఖ, మిషన్ భగీరథ ఆధ్వర్యంలో తాగునీటి పాయింట్లతో పాటు 5 వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాల నియంత్రణ, నిలుపుదల స్థలం ఏర్పాటులతో పాటు శాంతి భద్రతల పరిరక్షణ చర్యలు తీసుకోవాలని సీఐ చిట్టిబాబును ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యులు, సిబ్బందిని నియమించి మందులను అందుబాటులో ఉంచాలన్నారు. 108 అంబులెన్స్, తాత్కాలిక పడకలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి సుధాకర్ నాయక్‌కు సూచించారు. జాతర కొనసాగే సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, ప్లాస్టిక్ రహిత జాతరగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోత్స్న, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శంకరమ్మ, ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్, సంబంధిత అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉన్నత శిఖరాలకు ఎదగాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

విద్యార్థి దశలోనే కలలు కని వాటిని నెరవేర్చుకోవాలని, మానవజీవన క్రమంలో ఈ దశనే కీలకమైందని, చదువుతో పాటు బయట ఉన్న సమాజాన్ని చదివినప్పుడే మనకు సంపూర్ణ జ్ఞానం కలుగుతుందనికౌటాల సీఐ సాదిక్‌పాషా, సిర్పూర్ ఎస్ఐ దీకొండ రమేష్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ తాము చదువుకొనే రోజుల్లో ఇలాంటి సౌకర్యాలు అందుబాటులో లేకుండేవని, ప్రయివేటు పాఠశాలలు అందుబాటులో ఉండేవి కావన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పరిమితిస్థాయిలో ఉండేవని, అలాగే ఉపాధ్యాయుల కొరత కూడా ఉండేదని తెలిపారు. పెద్దల సూచనల మేరకు సుదూర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు వెళ్లికష్టపడి చదివి ఈ రోజు మంచి హోదాలో ఉన్నామన్నారు. ఇలాగే మీరు కూడా కష్టపడి చదివి తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు మంచిపేరు తీసుకురావాలని



వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సాదిక్‌పాషా

ఆకాంక్షించారు. నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, విద్యార్థి జీవితం తిరిగి రాదని, సమాజంలో మనకంటూ ఒక గుర్తింపు రావాలంటే ఈ దశనే కీలకమైందన్నారు. మన జీవితాన్ని ఏ విధంగా మలుచుకోవాలన్నా మనపైనే ఉందని, రాబోయే పబ్లిక్ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని వారికి సూచించారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయం ప్రిన్సిపల్, జిల్లా సమన్వయ అధికారి పోలోజు బాలరాజు, వైస్ ప్రిన్సిపాల్ క్రాంతి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ రక్షణ చట్టాలేవీ..?

● న్యాయం కోసం భర్త ఇంటి ముందు బైటాయింపు



నవతెలంగాణ-రెబ్బెన

మహిళల సంరక్షణ కోసం ఎన్ని చట్టాలు వచ్చినా ఇంకా మహిళలు గృహ హింసకు గురవుతున్నారు. నిత్యం ఎక్కడో చోట మహిళలు అత్తవారింట్లో వేధింపులతో ఇబ్బంది ఎదుర్కొంటూనే ఉన్నారు. కట్నం కోసం వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి. కొందరు మహిళలు మౌనంగా వేధింపులు భరిస్తుంటే, మరి కొందరు మహిళలు వేధింపులను భరించలేక పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతున్నారు. ఇంకొందరైతే అత్తగారి ఇంటి ముందు బైటాయించి ఆందోళనకు దిగుతున్నారు. తాజాగా కుమురం భీం జిల్లా రెబ్బెన మండలం గోలేటి గ్రామంలో అటువంటి ఘటన చోటుచేసుకుంది. గద్వాల్ జిల్లాకు చెందిన శ్రీకన్య అలియాస్ సోఫియా గోలేటిలోని భర్త మహమ్మద్ ఆసిఫ్ ఇంటి ముందు ఆందోళనకు దిగింది. మహమ్మద్ ఆసిఫ్ అనే వ్యక్తితో 2015లో తనకు పెళ్లి జరిగిందని అప్పటి నుండి మూడు సంవత్సరాల పాటు సజావుగా జరిగిన దంపత్యంలో 2019 సంవత్సరం నుండి తనను వేధిస్తున్నారంటూ ఆరోపించింది. పెళ్లి చేసుకుని 9 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఎటువంటి న్యాయం జరగలేదని తిరిగి 2023లో మరో పెళ్లి చేసుకుని తనను పూర్తిగా పట్టించుకోవడంలేదని కన్నీటి పర్యంతమైంది. రెండవ పెళ్లి చేసుకొని తనను మానసికంగా శారీరకంగా హింసకు గురి చేస్తున్నాడని బాధితురాలు ఆరోపించింది. తననుపెళ్లి చేసుకొని మోసం చేశాడని పేర్కొంది. తనకు న్యాయం కావాలంటూ భర్త ఇంటి ముందు బైఠాయించింది. ఇక శ్రీ కన్య అలియా సోఫియా చేస్తున్న ఆరోపణలు విన్నవారంతా అప్పటికే పెళ్లి చేసుకుని మరో వివాహం చేసుకోవడం మహిళల పట్ల జరుగుతున్న అన్యాయంపై స్థానిక పోలీసులు స్పందించి బాధిత మహిళకు తగు న్యాయం చేయాలని కోరుతున్నారు.

సంఘానికి గుర్తింపు పత్రం అందజేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఎన్నికలు నిర్వహించి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ సంఘానికి గుర్తింపు సంఘం పత్రం ఇవ్వకపోవడం సోచనీయమని, ఇప్పటికైనా సెంట్రల్ డిప్యూటీ లేబర్ కమీషనర్ వారు వెంటనే గెలిచిన సంఘానికి గుర్తింపు పత్రం అందజేయాలని టీబీజీకేయస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేయాలని కోర్టును కోరినప్పటికీ కూడా ఎన్నికలు వెంటనే నిర్వహించాలని కోర్టు ఆదేశించిన క్రమంలో లేబర్ కమీషనర్ ఎన్నికలు నిర్వహించి గుర్తింపు పత్రం ఇవ్వకపోవడం సరికాదన్నారు. సింగరేణిలో కార్మిక సమస్యల పరిష్కారం కోసం కార్పొరేట్, ఏరియా స్థాయి నిర్మాత్మక సమావేశాలు యాజమాన్యంతోని గెలిచిన సంఘం యూనియన్ జరుపాల్సి ఉందని, కానీ ఇప్పటివరకు గెలిచిన సంఘానికి గుర్తింపు సంఘంగా పత్రం ఇవ్వకపోవడం చాలా శోచనీయమన్నారు. నిర్మాణాత్మక సమావేశాల్లో కార్మికుల సమస్యల పరిష్కారానికి గెలిచిన గుర్తింపు సంఘం కృషి చేసే అవకాశం ఉందన్నారు. సమస్యలు చెప్పుకోవడంలో గెలిచిన సంఘాలు విఫలమవుతున్నాయన్నారు. ఇప్పటికైనా లేబర్ కమీషనర్ ఎన్నికలు పెట్టడానికి ఆరాటపడ్డారే తప్పా ఎన్నికలు నిర్వహించినంతరం చేయాల్సిన పనిని చేయకుండా కాలయాపనపై అనుమానాలకు తావిస్తుందన్నారు. లేబర్ కమీషనర్ ఇప్పటికైనా పట్టించుకొని గెలిచిన సంఘాలకు వెంటనే గుర్తింపు పత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి టీబీజీకేయస్ ఏరియా నాయకులు మాన్యు సమ్మయ్య, ఓరం కిరణ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



నవతెలంగాణ-రెబ్బెన

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు అన్నారు. గ్రామ పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం క్రింద రూ.4 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను నియోజకవర్గ ఇన్‌చార్జి ఆజ్మీర శ్యాంనాయక్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అంతర్గత రోడ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, కాంగ్రెస్ పెట్టిన మెనీఫెస్టోలో ఇప్పటికే ఆరు గ్యారెంటీల్లో రెండు గ్యారెంటీలను అమలుచేసి త్వరలోనే మరో రెండు గ్యారెంటీలకు శ్రీకారం చుట్టి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. రైతులకు రుణమాఫీ త్వరలోనే అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లావుడ్య రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, వనమాల మురళీ, మోడెం చిరంజీవిగౌడ్, మైనార్టీ మండల అధ్యక్షుడు ఇమ్రోజ్, మసాడి జగన్, ఆజ్మీర అశోక్, గోగర్ల రాజేష్, దుర్గం అన్నాజీ, గొడిసెల వెంకటేశ్వర్‌గౌడ్, బీంరావు, సునామీ పద్మ, జమ్మీబాయి, గుర్లె రాంచందర్, దత్తు, జయరాం పాల్గొన్నారు.

గాంధారి ఖిల్లా మైసమ్మ జాతర పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గేటు ఎదుట ఆదివాసీ నాయక్ పోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గాంధారి ఖిల్లా మైసమ్మ జాతర గోడ ప్రతులను ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, ఓరియంట్ సిమెంట్ పర్సనల్ మేనేజర్ కులకర్ణి దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, నాయక్ పోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, ఆలయ కమిటీ చైర్మన్ రొడ్డ రమేష్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 25వ తేది వరకు జరిగే బొక్కలగుట్టలోని గాంధారి ఖిల్లా మైసమ్మ జాతరకు ఆదివాసీలు, గిరిజనలు అన్ని వర్గాల వారు జాతరకు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ రొడ్డ రాజం, మాజీ సర్పంచ్ ఆడె జంగు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బొల్లు రమణారెడ్డి, సంస్కృతిక కార్యదర్శి రెడ్డి లక్ష్మణ్, గడ్డం భీమయ్య, కలవేని శ్రావణ్, సోయం సూరు, కార్మిక సంఘ నాయకులు కనక రాజు, తుడుందెబ్బ జిల్లా నాయకులు రొట్ట రవీందర్, బద్ది శ్రీనివాస్, రొడ్డ అనిల్, రెడ్డి భారతి, నాయుడి మల్లేష్, బద్ది మల్లికార్జున్, రంజిత్, కొమ్ముల రాంచందర్, భీమిని మహేందర్, రొడ్డ మల్లేష్, రొడ్డ లచ్చులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



నవతెలంగాణ-మందమర్రి

ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఆ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య అధ్యక్షతన వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవికూమార్ ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణయ్య మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివితే మంచి మార్కులు సులభంగా సాధించవచ్చని విద్యార్థిని విద్యార్థులందరూ కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల పోటీలలో గెలుపొందిన విజేతలకి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు టి ఉషారాణి, కె చంద్రకళ, ఎం రామయ్య, ఆర్ రాజమల్లు, కె జగన్ మోహన్, ఎస్ మహేష్, ఈ ప్రభాకర్, ప్రదీప్, కోటేశ్వర్, శ్రీకాంత్, వాజీర్, భాణేష్, నరసింహ, సతీష్, అనిత పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

దాడి చేసిన వ్యక్తిపై ఆదిలాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..స్టేషన్ పరిధిలోని రాంపూర్‌కు చెందిన బండి ప్రశాంత్ మేకల కాపరిగా పని చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం మేకలను తీసుకువచ్చి కొట్టం వద్ద వచ్చాడు. అదే సమయంలో రుక్మారెడ్డి మేకలను ఎటు తెస్తున్నావని అడగడంతో గొడవ మొదలైంది. దీంతో ప్రశాంత్ కొడ్డలి కామతో కొట్టాడు. రుక్మారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

విగ్రహా ప్రాణప్రతిష్టకు హాజరు కావాలి

నవతెలంగాణ-కౌటాల

విగ్రహ ప్రాణప్రతిష్టను విజయవంతం చేయండని పీఠాధిపతి మారుతి మహారాజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని వీర్దండి గ్రామ వార్దా నది తీరాన వెలిసిన బీర్య హనుమాన్ పుణ్యక్షేత్రం వీర్దండి గ్రామంలో మార్చి 7న ఉదయం 7.30 నిమిషాలకు శివుడి విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని భక్తజనులందరు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయలని కోరారు.